

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 19.0



యాదాద్రి థర్మల్‌పవర్ ప్లాంట్ నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం ఇచ్చే ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్లాంటు ప్రారంభానికి ముందే ఉద్యోగాలిస్తారని ఆశించినా, అధికారికంగా ప్రారంభించిన తర్వాత కూడా ఉద్యోగకల్పన ప్రక్రియ పూర్తి చేయకపోవడంపై నిర్వాసిత కుటుంబాల్లో అసంతృప్తి నెలకొంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

వైటీపీఎస్‌లో ఉద్యోగాలేవీ?

- విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనా నిర్వాసితుల ఎదురుచూపు
- 573 మందికి ఇప్పటికే ఉద్యోగ హామీపత్రాలు
- ఇళ్లు కోల్పోయిన 133 గిరిజన కుటుంబాల్లో అర్హుల వివరాల సేకరణ పూర్తి
- అయినా అందని నియామక పత్రాలు
- నత్తనడకన సాగుతున్న ప్రక్రియ

యాదాద్రి థర్మల్ ప్లాంట్ శంకుస్థాపన సమయంలో అప్పటి సీఎం కేసీఆర్ నిర్వాసితులు, భూములు కోల్పోయినవారికి ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలిసారి పవర్‌ప్లాంటును సందర్శించిన డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం నిర్వాసితుల త్యాగాన్ని గుర్తించి ఉద్యోగాలిస్తామని, భూములు కోల్పోయినవారికి ఉద్యోగాలివ్వడం కనీస బాధ్యత అని పేర్కొనడమేగాక ఆ ప్రక్రియను చేపట్టాలని జెన్‌కో, రెవెన్యూ అధికారులను పురమాయించారు. నిర్వాసితులకు ఉద్యోగాలిచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నా, అర్హులను తేల్చే ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండడం విమర్శలకు తావిస్తోంది.

573 మందికి ఉద్యోగహామీ కార్డులిచ్చిన ప్రభుత్వం

యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లో ఇళ్లు, భూములు కోల్పోయిన వారిలో 573 మందికి ఉద్యోగాలిస్తామనే హామీతో ఉద్యోగహామీ కార్డులను (జాబ్‌కార్డులు) ప్రభుత్వం ఇప్పటికే జారీచేసింది. ఇళ్లు, భూములు రెండూ కోల్పోయిన వీర్లపాలెం శివారు గిరిజనతండాలైన మోదుగులకుంట, కపూర్‌తండాలలోని 173 కుటుంబాలకు, అదేవిధంగా భూములు కోల్పోయిన మరో 440 కుటుంబాలకు ఉద్యోగాలిస్తామని ప్రకటించింది. అయితే ఉద్యోగాలు వదులుకుంటే ఆ కుటుంబానికి రూ.5లక్షల పరిహారం ఇస్తామని ప్రకటించడంతో మోదుగులకుంటతండా, కపూర్‌తండాలకు చెందిన 40 కుటుంబాల వారు పరిహారం తీసుకొని ఉద్యోగాలు వదులుకున్నారు. దీంతో ఈ తండాలకు చెందిన 133మందికి, భూములు కోల్పోయిన వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం (కొత్తపల్లి), తిమ్మాపురం గ్రామాలకు చెందిన మరో 440 కుటుంబాలకు కలిపి మొత్తం 573మందికి జాబ్‌కార్డులను గతంలోనే అందజేశారు. వీరికి అప్పటి ప్రభుత్వం

- మిగతా 8వ పేజీలో...

అటవీభూములను సాగుచేసిన వారిపై తేలని నిర్ణయం

పవర్‌ప్లాంటులో సేకరించిన భూముల్లో అటవీభూముల్లో పట్టాలు పొందిన (ఆర్‌వోఎఫ్‌ఆర్) గిరిజనులకు పరిహారమైతే ఇచ్చారు కానీ, వారికి ఉద్యోగాలిచ్చే విషయంలో ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ భూములు కోల్పోయిన రైతులు మరో 200 మంది వరకు ఉన్నారు. భూములు కోల్పోయిన కుటుంబీకులు వారికి సైతం తమ కుటుంబాల్లో అర్హులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వీరికి ఉద్యోగాలిచ్చే విషయంలో ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో వీరు ఆందోళనలు నిర్వహిస్తున్నారు.



కొందరిని అర్హులుగా తేల్చినా, ఉద్యోగాల ప్రకటనలో జాప్యమే

ఉపముఖ్యమంత్రి, మంత్రుల ఆదేశాల మేరకు తొలిదశలో ప్లాంటులో ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన వారి కుటుంబాల్లో అర్హులను గుర్తించారు. అందుకోసం అక్టోబరు, నవంబరు నెలల్లో రెవెన్యూ అధికారులు మోదుగులకుంటతండా, కపూర్‌తండాలకు చెందిన జాబ్‌కార్డులు పొందిన 133 కుటుంబాల్లో ఉద్యోగానికి ప్రతిపాదిస్తున్న వారి విద్యార్హతల పత్రాలు, నివాస పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లను పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఈ సర్వే వివరాలను జెన్‌కోకు సైతం అందజేశారు. డిప్యూటీ సీఎం మల్లుభట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించిన ప్రకారం మొదటి విడతలో ఈ 133 మందికి ఉద్యోగ నియామకాలు ఇవ్వాల్సి ఉంది. వీరికి ఎలాంటి విద్యార్హతలున్నా, అవసరమైనవారికి నైపుణ్యశిక్షణ కూడా అందజేయాలని ప్లాంటు పర్యటన సందర్భంగా డిప్యూటీ సీఎం జెన్‌కోను ఆదేశించారు. ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉన్నా, తొలిదశలో ప్రకటించినవారికైనా ఉద్యోగాల నియామకాలు చేపట్టకపోవడంపై అర్హులైనవారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్ఎస్‌లో సంస్థాగతమెప్పుడో?

- జిల్లా అధ్యక్షుల ప్రకటనతోనే సరి
- కార్యవర్గంతో పాటు అనుబంధ కమిటీలు నియమించని వైనం

(ఆంధ్రజ్యోతి, యాదాద్రి): టీఆర్ఎస్‌గా ఉన్నప్పుడు 2014కు ముందు పార్టీ సంస్థాగతంగా కీలకంగా వ్యవహరించి, ఎప్పటికప్పుడు పదవులు కేటాయిస్తూ, పర్యవేక్షిస్తూ ఉండేది. జిల్లా కమిటీలు బలోపేతంపై నిరంతరం అధ్యయనం చేసేది. అయితే అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యేలకు పూర్తి అధికారాలు బదలాయించి, ఇప్పటివరకు సంస్థాగతంగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేయలేదు. బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయి ఏడాది గడిచింది. ఈ నేపథ్యంలో సంస్థాగత ఎన్నికలపై పార్టీ అధిష్ఠానం దృష్టిసారించి జిల్లా, అనుబంధ కమిటీలు నియమించే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతం చేసే దిశగా పార్టీ అడుగులు వేస్తోంది.

జిల్లా అధ్యక్షులతోనే సరి

టీఆర్ఎస్‌ను భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారుస్తూ, జాతీయ రాజకీయాల్లోకి పార్టీ అరంగేట్రం చేసింది. జాతీయ పార్టీగా ఆవిర్భవించిన అనంతరం సంస్థాగత పదవులపై బీఆర్ఎస్ నేతల్లో ఆశలు రేకెత్తాయి. 2022 జనవరి 26న అధిష్ఠానం 33 జిల్లాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల రామకృష్ణారెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా దేవేరకొండ నాటి ఎమ్మెల్యే రవీంద్రనాయక్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా నాటి రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌ను అధిష్ఠానం పార్టీ నియమించింది. అయితే జిల్లా అధ్యక్షులకే పరిమితం చేసిన అధిష్ఠానం అనుబంధ సంఘాలకు పూర్తి స్థాయి కార్యవర్గాన్ని నియమించలేదు.

పునరుద్ధరణకు నోచుకోని కమిటీలు

జిల్లాల్లో అన్ని రాజకీయ పార్టీలకు సంస్థాగతంగా కమిటీలు ఉన్నాయి. ఏడేళ్ల క్రితం టీఆర్ఎస్ అధిష్ఠానం జిల్లా కమిటీలను రద్దు చేసింది. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో రాష్ట్ర కార్యదర్శులకు పార్టీ వ్యవహారాలను అప్పగించింది. నియోజకవర్గాల్లో పార్టీ పరంగా తీసుకునే కీలక నిర్ణయాలపై సర్వ అధికారాలు ఎమ్మెల్యేలకు అప్పగించింది. ఎమ్మెల్యేలతో పొసగని సీనియర్ నేతలు కొంతకాలంగా రాజకీయపరంగా నిశ్శబ్దంగా ఉన్నారు. నియోజకవర్గాల్లో నిర్వహించే పలు పార్టీ కార్యక్రమాలకు హాజరవుతూ, పార్టీలోనే కొనసాగుతున్నారు. మరోవైపు ద్వితీయ శ్రేణి నేతలకు రాజకీయంగా తీసుకునే నిర్ణయాల్లో అవకాశం కల్పించకపోవడంతో, వారు ఎదగలేకపోయారని అధిష్ఠానం గ్రహించింది. విభేదాలు సమసిపోవాలంటే పార్టీని జిల్లా కమిటీలకే అప్పగించాలని నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో

- మిగతా 7వ పేజీలో...

ప్రజలకు సేవలు అందించాలి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహాసభ ద్వారా ప్రజలకు సేవలు అందించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరై ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యుల్లో దైవభక్తితో పాటు సహాయం చేసే గుణం ఉంటుందన్నారు. దేవాలయాలకు, అన్నదాన సత్రాలకు ఆర్యవైశ్యులు విరివిరివిగా విరాళాలు ఇస్తూ సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణానికి ఎకరం స్థలాన్ని ప్రభుత్వం నుంచి ఇప్పించేందుకు మంత్రి కోమటిరెడ్డి సహకారంతో కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం పేద ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, దానికి నిధులు కూడా మంజూరు చేయనుందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకవస్తే సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, నూతన కార్యవర్గం బలోపేతం కోసం, ఆర్యవైశ్య పేదలకు సహకారం అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, భాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు :మంత్రి వెంకట్‌రెడ్డి



గుట్టలో గాంధీ గ్లోబల్ సదస్సులో రైతును సన్మానిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, కుంభం

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సుస్థిర విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ల ఆగమనంతో దేశంలో ఇప్పటికే సగం పల్లెటూళ్లు పల్లెదనం కోల్పోయాయన్నారు. తమ ప్రజా ప్రభుత్వం రైతన్న బతుకు బాగు చేయాలని 25లక్షల మందికి రూ.2లక్షల చొప్పున రుణమాఫీ చేసిందని, ఉచిత విద్యుత్ పథకాన్ని ఇచ్చి అండగా ఉందన్నారు. ప్రభుత్వం సంక్రాంతికి రైతు భరోసా ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. 10 రాష్ట్రాల్లో సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేసిన 115మంది రైతు జంటలకు పుడమిపుత్ర అవార్డులు, 35మంది అధికారులు, శాస్త్రవేతలు, జర్నలిస్టులకు కిసాన్‌సేవా అవార్డులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సైన్స్‌ఫెయిర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామలకిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఆలేరు, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్లు చైతన్యరెడ్డి, అవేస్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, పడమటి పావని, మెరుగు మధు, మాటూరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

- *నేడు నిరసన ర్యాలీ*
- *డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్*



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, చిత్రంలో బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ ర్యాలీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఆయన వ్యాఖ్యలు దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. అంబేడ్కర్ అందరివాడని, బడుగు, బలహీన వర్గాలు, దళిత సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన సారథ్యంలో రూపొందిన రాజ్యాంగంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, క్రైస్తవులు, మైనార్టీలు, అణగారిన వర్గాలపై దాడులు పెరిగాయని విమర్శించారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ తమ నాయకుడు రాహుల్‌గాంధీ కూడా పార్లమెంటులో ఆందోళన చేశారన్నారు. కాంగ్రెస్ అన్ని మతాలను గౌరవిస్తుందని, కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల సంక్షేమం ధ్యేయంగా పనిచేసిందని గుర్తుచేశారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు నంద్యాల వీరబ్రహ్మానందారెడ్డి, పిల్లి రమేష్‌యాదవ్, కిన్నెర అంజి, పేర్ల ఈశ్వర్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలకు బ్రేక్ లేదా?

- దేవరకొండలో కనిపించని స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్స్ పాయింట్లు
- దర్గా ఉర్సు వద్ద జనంపైకి దూసుకెళ్లిన డీసీఎం
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావుడి

7

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి

- స్వామివారిని దర్శించుకున్న 55వేల మంది భక్తులు
- నిత్య ఆదాయం రూ.57.52లక్షలు

7

నాయకుల నోట గందమల్ల మాట

- అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేల ప్రస్తావన

విద్యార్థులకు ఓపెన్ స్కూల్ వరం

రాష్ట్ర కోఆర్డినేటర్ అరుణశ్రీ



ప్రభుత్వ జూనియర్ బాలికల కళశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అరుణశ్రీ

నల్లగొండ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చదువును మధ్యలో నిలిపివేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ వరమని ఓపెన్ స్కూల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అరుణశ్రీ అన్నారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కల్లూరి సత్తమ్మతో కలిసి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఇంటర్ కళాశాలలోని ఓపెన్ స్కూల్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పలు కారణాలతో చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ విద్యను పూర్తి చేయవచ్చన్నారు. వారికి ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తుందన్నారు.

ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ పూర్తిచేసినా, రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా గుర్తింపు ఉంటుందన్నారు. డిగ్రీ, పీజీలతో పాటు అన్ని ప్రభుత్వ నియామకాలకు అర్హత ఉందన్నారు. చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థులు నిరాశ చెందకుండా భవిష్యత్‌కు ఓపెన్ స్కూల్ ద్వారా బంగారు బాటలు వేసుకోవాలన్నారు. వారి వెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సుధారాణి, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

నల్లగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వంటావార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఆలోగా పేస్కేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇక సమగ్ర శిక్ష ఉద్యోగులకు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రాజకీయ నాయకుల మద్దతు పలికారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్

నల్లగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 90శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్ల వంటి సౌకర్యాలు కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో డీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరణ నిరాహార దీక్ష మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గడియారం సెంటర్‌లో జరిగిన రాస్తారోకో, నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు ఐదు డిమాండ్లు ఉంచామని, వీటిని వెంటనే నెరవేర్చాలన్నారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంతో పాటు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్, కొండేటి నరేష్, అల్లంపల్లి కొండన్న, కాసర్ల లింగస్వామి, గంట సుమంత్, సుజిత్, నరేష్, మహేందర్, వెంకన్న, గిరి, ఎల్లయ్య, మహేశ్వరాచారి, కృష్ణయ్య, వినోద్, సురేష్, సుధాకర్, పరమేష్, మహేష్, సైదులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు



విద్యుద్దీపాల అలంకరణలో మఠంపల్లిలోని శుభవార్త దేవాలయం

- ప్రత్యేక అలంకరణలో చర్చిలు, ప్రార్థనా మందిరాలు
- మఠంపల్లిలో రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

క్రిస్మస్ పర్వదిన వేడుకలకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచర్చిలు ముస్తాబయ్యాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని పలు చర్చిలు వేడుకలకు ముస్తాబుచేశారు.



మఠంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ తెలంగాణలోనే అతి పెద్ద చర్చిగా పేరొందిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయం క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే మహోత్సవాలకు దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పరవళ్లు తొక్కే కృష్ణానదీ తీరాన వెలసిన శుభవార్త దేవాలయం మరియమాత దీవెనలతో విరాజిల్లుతోంది. ఇక్కడ కులాలకు, మతాలకు అతీతంగా ప్రార్థనలు చేస్తూ మరియమాత దీవెనలు పొందుతుంటారు. ఈ లోకానికి రక్షకుడిని అందించిన తల్లిగా భక్తుల బాధలను, వ్యాధులను, ఇతర సమస్యలను తన కుమారుడిని ప్రార్థించే వారి అవసరాలు తీర్చే తల్లిలా ఆమె ప్రసిద్ధి. శుభవార్త దేవాలయం(మంగళవార్త చర్చి) 1968లో నిర్మించారు. అనంతరం పునర్నిర్మాణంలో భాగంగా 1980లో శంకుస్థాపన చేయగా 1993వ పూర్తి చేశారు. అప్పటివరుకు మంగళవార్త చర్చిగా పిలవబడుతున్న దేవాలయానికి శుభవార్త దేవాలయంగా నామకరణం చేశారు. వేడుకలకు గ్రామానికి చెందిన క్రైస్తవ కుటుంబీకులతో పాటు ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లోని బంధువులు హాజరవుతుంటారు. రెండు రోజుల పాటు జరిగే వేడుకల వివరాలను విచారణ గురువు మార్టిన్ పనల శుక్రవారం ప్రకటించారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు నవదిన జపములు, దివ్యబలిపూజ కార్యక్రమాలు, క్రైస్తవ భక్తులను ఉద్దేశించి ప్రసంగం, పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 25న జరిగే శుభవార్త చర్చి జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలలో ఉన్న ప్రముఖులు, గురువులు, బిషప్‌లతో పాటు విదేశాల్లోని క్రైస్తవులు కూడా హాజరై ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మర్రిగూడ మండలంలో

మర్రిగూడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవుల ఆరాధ్య దైవమైన ఏసు క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలకు నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. కమ్మగూడెం గ్రామంలో పునీత జోజప్ప మందిరాన్ని నిర్మించి సుమారు 50 ఏళ్ల పూర్తయ్యాయి. ఈ చర్చిని అప్పటి ఫాదర్ కాశీరాం ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఇక్కడ క్రైసవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటారు. పూర్వీకులు నిర్మించిన ఈ మందిరాన్ని జ్ఞాపకం చేసుకుంటూ క్రిస్మస్ సందర్భంగా వేడుకలను నిర్వహించుకుంటారు. అదేవిధంగా ఎబినేజర్ ప్రార్థన మందిరంలో మౌంట్ సినాయి సువార్త సంఘం, శాలోమ్ పలు మందిరాలను క్రైస్తవ సోదరులు ముస్తాబు చేశారు. ఇప్పటికే పలు చర్చిల్లో సెమీక్రిస్మస్ సంబురాలు, ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ప్రత్యేక ప్రార్థనలతో చర్చిల ఆవరణలు ఆహ్లాదకరంగా మారాయి. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించుకోవడానికి అన్ని సిద్ధం చేసుకుంటున్నారు.



చర్చిలోపల అలంకరణ



మర్రిగూడ మండలం కమ్మగూడెంలో 100 అడుగుల ఎత్తులో నిర్మించిన గోపురంతో చర్చి ప్రాంగణం

కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా బాలికల జట్టు



ఆలేరు నుంచి వెళ్తుతున్న కబడ్డీ జిల్లా జట్టు క్రీడాకారులు

ఆలేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హకీంపేటలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు యాదాద్రిభువనగిరి జిల్లా బాలిక జట్టు ఆదివారం బయలుదేరింది. ఈ నెల 22 నుంచి 25 వరకు హకీంపేట బాలికల గురుకుల క్రీడామైదానంలో పోటీలు జరుగుతున్నట్లు క్రీడాకారులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న జిల్లా జట్టును ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యయులు, పలువురు అభినందించారు. కబడ్డీలో రాష్టస్థాయి ప్రథమ విజేతలుగా నిలవాలని ఆశీర్వదించారు. అనంతరం జట్టు క్రీడాకారులను ఆర్టీసీ బస్సులో తీసుకెళ్లారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మాదాసు జోసఫ్, కబడ్డీ జిల్లా అసోసియేషన్ కోశాధికారి గంధమల్ల కుమార్, సహాయ కార్యదర్శులు పూల చంద్రకుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమస్థానం



ప్రథమ విజేతగా నిలిచిన జట్టును అభినందిస్తున్న గ్రామ యువకులు

ఆలేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఫుట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ఆలేరు మండలం గుండ్లగూడెం జట్టు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. క్రీడాకారులను గ్రామానికి చెందిన యువకులు అభినందించారు. పోటీల్లో విజేత నిలిచిన జట్టు నుంచి ఆరుగురు రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికచేశారు. వారిలో పీ రాజేష్, కే రాజు, వెంకటేష్, దినేష్, వీరేందర్ ఉన్నారు.

న్యాయమూర్తి తులాభారం



యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం సమీపంలోని స్వర్ణగిరి ఆలయాన్ని భువనగిరి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం ఉషశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. స్వామి వారి దర్శన అనంతరం తులాభారంతో మొక్కులు చెల్లించుకున్నారు.

ఏం చేస్తాం.. తాళం చెవి పోయింది





యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణం పరిధి రాయగిరిలో ఆదివారం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసుల వాహనం తాళం చెవి ఎక్కడో పోయింది. చుట్టుపక్కలా వెతికినా కనిపించకపోవడంతో మరో వాహనంతో ఆ వాహనాన్ని తీసుకెళ్లారు. ప్రజలు దీనిని ఆసక్తిగా తిలకించారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

వీల్‌చైర్ క్రికెట్‌లో ప్రతిభ చాటిన సురేష్



ఫైనల్ ట్రోఫీతో ధరావత్ సురేష్

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వీల్ చైర్ క్రికెట్ పోటీల్లో నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్లతండాకు చెందిన సురేష్ మరోసారి తనప్రతిభను చాటాడు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నగరంలో ఉమాంగ్ గౌరవదీప్ నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ పోటీలు ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నీలో శారీరకంగా వైకల్యం ఉన్నప్పటికీ సురేష్ పలు మ్యాచ్‌లో ప్రతిభను కనబరిచాడు. ఫైనల్ మ్యాచ్ తెలంగాణ, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల మధ్య జరగ్గా తెలంగాణ రాష్ట జట్టు ఘన విజయం సాధించింది. కీలకమైన ఆరు వికెట్లను తీయడంతో పాటు మంచి పరుగులు సాధించి ఆల్‌రౌండ్ ప్రతిభను చాటాడు. ఈ సందర్భంగా సురేష్‌ను తండావాసులు అభినందించారు.

కాలినడక భక్తులకు నేరుగా దర్శనం



సమావేశంలో కరపత్రాలను చూపిస్తున్న అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నాయకులు

నల్లగొండ, కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు కాలినడకన వెళ్లే భక్తులకు క్యూలో నిలబడకుండా నేరుగా అయ్యప్పస్వామి దర్శనం చేసుకునే సౌకర్యాన్ని కేరళ ప్రభుత్వం కల్పించిందని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి కేంద్ర కమిటీ అధ్యక్షుడు రాజు దేశ్పాండే, ఆర్గనైజింగ్ కార్యదర్శి యాదయ్య, ప్రచార కార్యదర్శి సోము, పూల గురుస్వామి తెలిపారు. ఆదివారం నల్లగొండలోని అయ్యప్ప సేవా సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని 2022 ఏప్రిల్‌లో కేంద్ర కమిటీ ద్వారా కేరళ సీఎంకు వినతిపత్రం సమర్పించామన్నారు. అందుకు స్పందనగానే ఈ ఏడాది అమలుచేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా శబరిమలకు వెళ్లే అయ్యప్పమాలధారణ స్వాములకు రూ.5లక్షల ఉచిత ప్రమాద బీమ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా పిల్లలకు, స్త్రీలకు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామి వారి దర్శనానికి దేవస్థానం బోర్డు అనుమతి ఇచ్చిందన్నారు. సమావేశంలో సంస్థ కార్యవర్గ సభ్యులు పుట్టబోతుల కృష్ణమూర్తి, కందగట్ల విఠల్, కోట శ్రీనివాస్, బిక్షమయ్య, నిఖిల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుడిగా మార్చిన సినిమా

యాదాద్రిభువనగిరి చౌటుప్పల్‌లో ప్రదర్శించిన అయ్యప్పస్వామి మహత్యం సినిమా ఓ సామాన్యుడిని అయ్యప్ప దీక్షాపరుడిగా మార్చింది. అదే భక్తుడికి వచ్చిన ఒక కల దేవాలయ నిర్మాణానికి కారణమైంది. ఇప్పుడా భక్తుడు ప్రసిద్ధ గురుస్వామిగా 35వ సారి మాలధారణతో శబరిమలై యాత్రకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో 35 ఏళ్లలో వేలాది మంది భక్తులకు మాలధారణ చేయిస్తున్నాడు. భక్తులకు ఆయన చేసిన సేవలకు గాను అనేక పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అయ్యప్పస్వాములు, భక్తులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న చౌటుప్పల్ పట్టణానికి చెందిన బొబ్బిళ్ల మురళిగురుస్వామి 35 ఏళ్ల ప్రస్థానం ఇది.

- (ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

- సామాన్యుడి నుంచి ప్రతిభావంతమైన గురుస్వామిగా..
- అయ్యప్ప ఉపదేశాన్ని నిజం చేస్తూ దేవాలయ నిర్మాణం
- అయ్యప్ప సేవలో అనేక పురస్కారాలు
- తెలుగు రాష్ట్రాల్లోని భక్తులకు స్ఫూర్తి మురళీగురుస్వామి



బొబ్బిళ్ల మురళి గురుస్వామి



మురళి అయ్యప్పస్వామి దేవాలయం

చౌటుప్పల్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త బొబ్బిళ్ల మురళి 1989లో శరత్‌బాబు నటించిన అయ్యప్పస్వామి మహత్యం సినిమాను స్థానిక థియేటర్‌లో చూసి భక్తి మార్గం వైపు ప్రేరణ పొందారు. అదే సంవత్సరం నవంబరు 25న అయ్యప్పమాల వేసుకొని 41 రోజుల దీక్షను చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు మురళి మాలధారణతో దీక్షను నిర్వహిస్తూ గురుస్వామిగా అందరి ప్రశంసలను అందుకుంటున్నారు. మాలధారణతో దీక్షలను నిర్వహిస్తున్న 9ఏళ్ల తరువాత మురళికి అయ్యప్పస్వామి కలలోకి వచ్చి తనకు ఈ ప్రాంతంలో గుడి కట్టించాలని ఉపదేశించారట. ఆ ఉపదేశాన్ని నిజం చేస్తూ పట్టణంలోని ఊర చెరువు ఒడ్డున 1998 జూన్‌లో ఒక చిన్న రేకుల షెడ్డును వేయించి అందులో అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యపూజలు ప్రారంభించాడు. ఈ గుడిలో పూజలు చేసేందుకు అయ్యప్పమాలధారులతో పాటు భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగింది. దీంతో ఆ చెరువు పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామి నామస్మరణతో మారుమోగేవి. దేవాలయానికి ప్రాముఖ్యం పెరగడంతో ఆధ్యాత్మిక వేత్తలు, పీఠాధిపతులు, సాధువులు విచ్చేసి భక్తులకు ఉపదేశాలు, ప్రవచనాలు ఇచ్చేవారు.

2001 నుంచి అన్నదానం

మురళి గురుస్వామి ప్రవేశపెట్టిన 2001 నుంచి అయ్యప్పదీక్షల సందర్భంగా ప్రారంభమైన అన్నదాన కార్యక్రమాలు నేటికీ కొనసాగుతున్నాయి. ప్రతీ ఏడాది నవంబరు 16 నుంచి జనవరి 12 వరకు ఈఅన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఈదేవాలయ సన్నిధానంలో 500నుంచి 600మందివరకు అయ్యప్ప స్వామి దీక్షాదారులు ఆశ్రయం పొందుతారు. ఈదేవాలయంలో స్వాములకు అన్నదానం చేసేందుకు భక్తులు అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

మాంసాహారాన్ని త్యజించిన మురళి

మొదటి మాలాధారణ చేసిన 1989 సంవత్సరం నుంచి మురళి మాంసాహారాన్ని త్యజించారు. చిన్నప్పటి నుంచే మద్యపానం అలవాటు లేదు. శబరిమలైకు వెళ్లిన 34 పర్యాయాల్లో 30 సార్లు పెద్ద పాదం (60 కిలోమీటర్లకు పైగా) నుంచి వెళ్లి జ్యోతి దర్శనం చేసుకున్నారు. 2020లో ప్రబలిన కరోనా సమయం నుంచి చిన్నపాదం(7 కిలోమీటర్లు నడిచి) నుంచి నాలుగు సార్లు జ్యోతి దర్శనం చేసుకున్నారు. మాల ధారణ చేసుకున్నటి నుంచి 34సార్లు జ్యోతి దర్శనం చేసుకోవడం విశేషం.


2012లో దేవాలయానికి భూమిపూజ

మురళి తీసుకున్న ప్రత్యేక చొరవతో చిన్న రేకుల షెడ్‌లో ఉన్న అయ్యప్పస్వామికి పెద్ద దేవాలయం నిర్మాణం చేసేందుకు 2012లో శ్రీసిద్దేశ్వర భారతీస్వామి భూమి పూజ నిర్వహించారు. దాతల సహకారంతో రూ.1.62 కోట్లను వెచ్చించి ఆధ్యాత్మికత ఉట్టి పడేలా దేవాలయాన్ని నిర్మించారు. 2015 మే 31 నుంచి జూన్ 4 వరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలలో అయ్యప్పస్వామితో పాటు వినాయకుడు, పరమేశ్వరీదేవి, సుబ్రమణ్యస్వామిల విగ్రహాలను ప్రతిష్ఠించారు. దేవాలయ నిర్మాణంలో మురళి గురుస్వామి నిర్వహించిన పాత్రను అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ దేవాలయానికి మురళి గురుస్వామి వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

అనేక పురస్కారాలు

ప్రజలలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంలో మురళి గురుస్వామి చేసిన సేవలకు అనేక పురస్కారాలను అందుకున్నారు. అందులో ప్రధానంగా మూడుసార్లు ఉత్తమ గురుస్వామిగా పురస్కారాలను అందుకున్నారు. అఖిలభారతీయ అయ్యప్పధర్మ ప్రచార సభనుంచి 2021-22కు అయ్యప్ప పురస్కారాన్ని పొందారు. 2021లో ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు, 2024లో మహాశాస్తా సేవా ట్రస్ట్ ఉత్తమ గురుస్వామి అవార్డులు అందుకున్నారు.

కఠిన దీక్షతోనే మనోభీష్టం నెరవేరుతుంది



35 ఏళ్లుగా అయ్యప్పస్వామి మాలాధారణతో కఠినమైన దీక్షలను పాటిస్తున్నా. ప్రతి ఒక్కస్వామి కూడా మాలాధారణతో పాటు ఇరుముడిని గురువులతోనే వేయించుకోవాలి. దీక్షలు పాటించే స్వాములు తప్పనిసరిగా సమూహంగా సన్నిధానంలో ఉండాలి. సహపంక్తి భోజనాలు చేయాలి. 41 రోజులు విధిగా దీక్షలను నిర్వహించాలి. దీక్షలలో నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తేనే భక్తుల మనోభీష్టం నెరవేరుతుంది. దీక్షా సమయాలతో పాటు 365 రోజులు కూడా నిష్ఠగా ఉండడం అలవాటు చేసుకుంటే అన్నివిధాలా శ్రేయస్కరం.

- బొబ్బిళ్ల మురళి గురుస్వామి, చౌటుప్పల్

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



లింగం(ఫైల్)

నాంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలోని కేతేపల్లి ట్రాక్టర్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం కొత్తబాయి గ్రామానికి చెందిన పిల్లి రామలింగం(28) సెంటింగ్ పనులు చేస్తూ జీవిస్తుంటాడు. ఆయనకు భార్య అనూషతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం నాంపల్లి మండలంలోని దామెర గ్రామంలో జరిగిన శుభ కార్యానికి హాజరై తిరిగి వెళ్తుండగా కేతేపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం తరలిస్తుండగా లింగం కుటుంబసభ్యులు కొద్దిసేపు అడ్డుకున్నారు. న్యాయం చేయాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దేవరకొండ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. లింగం తండ్రి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

కారు బోల్తా: ఇద్దరికి గాయాలు

హుజూర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలో కారు బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మేళ్లచెర్వు మండలం గానుగబండకు చెందిన ఇద్దరు మైనర్లు మేళ్లచెర్వు నుంచి హుజూర్‌నగర్‌కు ఆదివారం కారులో వస్తున్నారు. వేపలసింగారంలోని మిట్టగూడెం మూలమలుపు వద్ద అతివేగంగా రావడంతో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి కారు అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు మైనర్లకు గాయాలయ్యాయి. కాగా కారు నడుపుతున్న యువకులు వెంటనే కారును అక్కడి నుంచి తీసుకవెళ్లారు. కాగా ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

30 టన్నుల నల్లబెల్లం స్వాధీనం



పట్టుకున్న నల్లబెల్లం లారీ, నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

తుంగతుర్తి / తిరుమలగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని ఎక్సైజ్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరుమలగిరి మండలం వెలిశాల ఎక్స్ రోడ్డు వద్ద సూర్యాపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎంహెచ్ 26 సీహెచ్ 0075 నెంబలర్ గల లారీలో అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల నల్లబెల్లం, క్వింటా పటిక, 20లీటర్ల నాటుసారా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. లారీలో ఉన్న గంగారామ్‌ను అరెస్టు చేశామని మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. తనిఖీలో టాస్క్‌ఫోర్స్ సీఐ మల్లయ్య, ఎక్సైజ్ ఎస్‌ఐ మూర్తి, రామకృష్ణ, సిబ్బంది ఆంజనేయులు, కొండల్, శ్రీకాంత్, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్: కేసు నమోదు

కనగల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న లారీని ఆదివారం నల్లగొండ జిల్లా కనగల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా చొల్లూరు ఇసుక రీచ్ నుంచి అంబర్‌పేటకు ఇసుకరవాణా అనుమతులు పొంది నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలానికి రవాణా చేస్తుండగా ఆదివారం ఉదయం కనగల్‌లో పోలీసులు పట్టుకున్నారు. లారీని సీజ్ చేయడంతో పాటు డ్రైవర్ కరుణాకర్, ఓనర్ సైదులుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	577
టీఎంసీలు	274.3640
ఎడమకాల్వకు నీటి విడుదల	8022
కుడికాల్వకు	7086
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	28,252 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	17,808 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.03 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	0
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644 అడుగులు
టీఎంసీలు	4.20
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	15.97 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	325 క్యూసెక్కులు

రోడ్డు ప్రమాదాలకు బ్రేక్ లేదా?



దేవరకొండ పెద్దదర్గా వద్ద స్పీడు బ్రేకర్లు, హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

- రోడ్డుపై కన్పించని స్పీడు బ్రేకర్లు, సిగ్నల్స్ పాయింట్లు
- దర్గా ఉర్సు వద్ద జనంపై దూసుకెళ్లిన డీసీఎం
- ముగ్గురు అమాయకుల మృత్యువాత
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావుడి

దేవరకొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. వాహనాల అతివేగం, స్పీడు బ్రేకర్లు, సిగ్నల్స్ పా యింట్లు లేకపోవడం కారణంగా తెలుస్తోంది. ప్రమాదా లు జరిగినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకొని వెళుతున్నారే తప్ప నివారణ చర్య లు చేపట్టకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారు. దేవరకొండ డివిజన్‌లో 24గంటల వ్యవధిలోనే అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణం గా నలుగురు మృతిచెందారు. ఈ నెల 21న ఉదయం 6.30 గంటల ప్రాంతంలో దేవరకొండ పట్టణ శివారు జడ్చర్ల- కోదాడ రహదారిపై హజ్రత్ ఖాదర్‌షా వలి దర్గా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు చనిపోయారు.

డీసీ ఎం దూసుకెళ్లడంతో కొబ్బరికాయలు విక్రయిస్తున్న తాటికోలుకు చెందిన ఎండీ. హాజిమియా, నాగర్‌కర్నూల్ జిల్లా మేడిపూర్‌కు చెందిన అబ్దుల్ ఖాదర్, హైదరాబాద్‌కు చెందిన నబినాబేగం మృతిచెందారు. ఈ నెల 20వ తేదీన దేవరకొండ మండలం తూర్పుపల్లి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా దేవరకొండ నుంచి కల్వకుర్తివైపు అతివేగంగా వెళుతున్న కారు ఢీకొనడంతో అంకూరి ఎల్లమ్మ(55) అక్కడికక్కడే మృతిచెందింది.

మృతుల కుటుంబాలది తీరని వేదన

దీంతో ఆ కుటుంబాలు దుఖసాగరంలో మునిగిపోయాయి. దేవరకొండ మండలం తాటికోలుకు చెందిన ఎండీ. హాజిమియా జాతర్లు, ఉర్సు ఉత్సవాల్లో కొబ్బరికాయలు, దేవుడి పూజ సామాగ్రి, తినుబండరాలు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయనకు భార్య జాహంగీర్‌బితోపాటు ముగ్గురు ఆడబిడ్డలు ఉన్నారు. ఆడపిల్లల వివాహ లయ్యాయి. కుటుంబానికి పెద్దదిక్కైన హాజిమియా మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా మేడిపూరుకు చెందిన అబ్దుల్ ఖాదర్(19) అన్వర్‌పాషకు ఒక్కగానొక్క కొడుకు. రోడ్డు ప్రమాదంలో అబ్దుల్ ఖాదర్ మృతిచెందగా, అన్వర్‌పాష కాలు విరిగింది. ఉర్సు ఉత్సవాలకు వచ్చి ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు దుఖసాగరంలో మునిగిపోయారు. ఉర్సు ఉత్సవాలకు వచ్చిన హైదరాబాద్ చంపాపేటకు చెందిన నబినాబేగం(25) రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. తల్లి కేమైందని ఆమె ఇద్దరు చిన్నారులు అడుగుతుండడం అక్కడున్న వారు కంటతడి పెట్టారు. నబినాబేగం మృతి చెందడంతో భర్త ఖాదర్‌పాష కన్నీటి పర్యంతమవుతున్నాడు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడమే పెద్ద దర్గా వద్ద ప్రమాదం జరగడానికి కారణమని బాధితుల బంధువులు తెలిపారు. దర్గా వద్ద స్పీడు బ్రేకర్లతోపాటు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దేవరకొండ మండలం కొండభీమనపల్లి, దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ఆర్చి వద్ద తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నెల రోజుల క్రితం ఎంకేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి భీముడు కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కల్వకుర్తి నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. మూడు నెలల క్రితం కొండభీమనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జంగయ్య అనే రైతు మృతిచెందాడు. అతివేగాన్ని అరికట్టే విధంగా చర్యలు తీసుకొని స్పీడు బ్రేకర్లు, ప్రమాదాల హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్పీడు బ్రేకర్లు ఉంటే ప్రమాదం జరిగేది కాదు



దేవరకొండ పెద్దదర్గా వద్ద స్పీడు బ్రేకర్లు, హెచ్చరికల బోర్డులు ఉంటే రోడ్డు ప్రమాదం జరిగి ఉండేది కాదు. స్పీడు బ్రేకరు లేకపోవడంతోనే డీసీఎం డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. స్పీడు బ్రేకర్లు, ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేసి అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి.

\- దస్తగిరి, ఎర్రారం

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం. తరుచూ తనిఖీలు చేస్తున్నాం. హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తాం. అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడిపిన వారిపై చర్యలు చేపడతాం.

\- నర్సింహులు, దేవరకొండ సీఐ.

నాయకుల నోట గందమల్ల మాట

- గందమల్లపై అసెంబ్లీలో చర్చ
- ఆలేరు ప్రజల్లో చిగురిస్తున్న ఆశలు



గందమల్ల చెరువు

తుర్కపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా ఆలేరు ప్రజలు సాగు, తాగునీటిస్తున్న ఎదురు చూస్తున్న గందమల్ల ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. 20 ఏళ్లుగా ఏ ఎన్నికలొచ్చినా ఏ పార్టీ అయినా మొట్ట మొదటగా ఆలేరు ప్రజలకు నాయకులు హామీ ఇచ్చేది గందమల్ల ప్రాజెక్టుపైనే. గందమల్ల రిజర్వాయర్ నిర్మాణంపై ఆలేరు ప్రజల సాగు, తాగు నీటి వనరు అయిన గందమల్ల ప్రాజెక్టుకు నిధులు వెచ్చించి పూర్తి చేయాలని శాసన మండలి, శాసన సభలో నాయకులు సభా దృష్టికి తీసుకురావడంపై ప్రజలు హర్షిస్తున్నారు. ఉభయ సభల్లో కాంగ్రెస్ నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభా దృష్టికి తీసుకొచ్చారు. రెండు రోజులుగా గందమల్లపై చర్చ జరగడంతో సాగు నీటి ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని, గందమల్ల కింది రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆలేరు, రాజాపేట, గుండాల, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, మోత్కూర్, తిరుమలగిరి మండలాల్లోని రైతులకు ఎంతో ప్రయోజనంగా ఉండి వేల ఎకరాలు సాగులోకి రానున్నాయి. ఇటీవల గోదావరి జలాలతో గందమల్ల చెరువును నింపి కింది ప్రాంతానికి నీటిని వదలడంతో ఆలేరు. గుట్ట, రాజాపేట, గుండాల, కొన్ని చెరువులను ఈ నీటితో నింపారు. గందమల్ల చెరువు నుంచి బేగంపేట, రఘునాథపురం, కొలనుపాక, ఆలేరు, గుండాల మండలాలతో అనుసంధానంగా ఉన్న వాగులో నీరు పారడంతో వాగుకు ఇవురవైపులా ఉన్న బోర్లు, బావుల్లో నీటి ఊటలు పెరిగాయి. భూగర్భ జలాలు పెరగడంతో వర్షాలు తక్కువగా కరిసినా నీటి సమస్య లేకుండా పోయింది. అసెంబ్లీలో నాయకుల నోట గందమల్ల మాట రావడంతో గందమల్ల ప్రాజెక్టుపై ఆశలు సజీవంగా ఉన్నాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. గందమల్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రజల కల నెరవేరనుంది



ఎన్నో ఏళ్ల పోరాటం.. ఎన్నో ఏళ్ల రైతుల సాగునీటి కల నెరవేరనున్నది. రాష్ట్రం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గందమల్ల ప్రాజెక్టుపై శాసన సభలో ప్రస్తావించి సభా దృష్టికి తేవడం హర్షనీయం. వారికి మా ఆలేరు ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు. సాగు, తాగు నీటి సమస్య గందమల్లతోనే తీరుతుంది. ఆలేరులో బీడు భూములన్నీ సస్య శ్యామలం అవుతాయి.

\-వంచ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ చల్లూరు, రాజాపేట (మండలం)

చలించిన పేగు బంధం

- కిడ్నీ దెబ్బతినడంతో కుమార్తెకు ఆరోగ్యసమస్యలు
- కుమార్తెకు తండ్రి కిడ్నీ దానం



పులగం సుదర్శన్, కిడ్నీ దానం చేసిన తండ్రి (ఇన్‌సెట్లో) ఆమని, కిడ్నీ పొందిన కుమార్తె

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 22 (ఆంధ్యజ్యోతి): కన్న బిడ్డలు ఆపదలో ఉంటే తల్లిదండ్రుల మనస్సు వికలమైపోతుంది. బిడ్డలపై వారికి ఎనలేని మమకారం ఉంటుంది. ప్రాణాపాయంలో ఉన్న కుమార్తె కోసం ఓ తండ్రి తనకిడ్నీని దానమిచ్చాడు. తనకు వయస్సు మీద పడినా కుమార్తె భవిష్యత్ కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టాడు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన పులగం సుదర్శన్. తండ్రికి పిల్లలపై ఎంత ప్రేమ ఉంటుందో చాటిచెప్పిన ఉదంతమిది. యాదగిరిగుట్ట పట్టణ కేంద్రానికి చెందిన పులగం సుదర్శన్(58) వృత్తిరీత్యా 40ఏళ్లుగా టైలరింగ్ చేస్తుండటంతో ఆయన్ను పులగం టైలర్ అని పిలుస్తుంటారు. సుదర్శన్, ప్రమీల దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్నకుమార్తె ఆమనికి వివాహం కాగా ఇద్దరు సంతానం ఉన్నారు. ఆమని భర్త హైదరాబాద్‌లో జనరల్ స్టోర్ నడుపుతూనే, ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో విపరీతమైన కాళ్ల వాపులు, శ్వాస ఆడకపోవడం, దమ్ము, ఆయాసంతో ఆమని ఇబ్బంది పడింది. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోగా కిడ్నీ దెబ్బతిన్నదని, డయాలసిస్ తప్ప మరోమార్గం లేదని తేల్చి చెప్పారు. అదే సమయంలో కొత్త కిడ్నీ అవసరమని, ఇందుకోసం పెద్దమొత్తంలో ఖర్చవుతుందని తెలిపారు. ఎన్నిసార్లు చికిత్స చేయించినా ఆమని సమస్య తీరకపోగా, రోజు రోజుకూ ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. ఈ తరుణంలో కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కిడ్నీ దానం చేస్తే అమర్చుతామని, కానీ ఖచ్చితంగా సఫలం అవుతుందని చెప్పలేమని వైద్యులు తేల్చిచెప్పారు.

అయినప్పటికీ తన కుమార్తె కోసం కిడ్నీ దానం చేసేందుకు తండ్రి సుదర్శన్ ముందుకువచ్చాడు. పేగుబంధాన్ని కాపాడుకోవటానికి తన కిడ్నీ ఇస్తానని చెప్పారు. వైద్యపరీక్షల అనంతరం తండ్రి సుదర్శన్ కిడ్నీని కుమార్తె ఆమనికి సరిపోతుందని,అమర్చేందుకు వీలవుతుందని వైద్యులు నిర్ధారించారు. ఈ ఏడాది జూలై 27 తేదీన శస్త్రచికిత్స చేసి కిడ్నీని ఆమనికి అమర్చారు.

శస్త్రచికిత్స అనంతరం మూడు నెలల తర్వాత యథావిధిగా సుదర్శన్ తన టైలరింగ్ పనుల్లో నిమగ్నమయ్యాడు. శస్త్రచికిత్స పూర్తయి సుమారు ఐదు నెలలు కావస్తుండగా, ఇద్దరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా ఉన్నారు. తన కుమార్తెకు కిడ్నీ దానం చేసి బతికించుకున్నందుకు సుదర్శన్‌కు చెప్పలేని ఆనందం కలిగింది. కన్న కుమార్తెకు కిడ్నీ దానం చేసి సమాజంలో మావన సంబంధాలు, ఆత్మీయత అనురాగాలకు అర్థం చెప్పిన గొప్పవ్యక్తిగా సుదర్శన్‌ను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

కుమార్తె జీవితం కన్నా ఎక్కువేముంది



ఆమని కిడ్నీ సమస్యతో ఇబ్బందిపడటం బాధించింది. తండ్రిగా తట్టుకోలేకపోయా. నా కిడ్నీ సరిపోతుందని వైద్యులు తెలపడంతో ఇచ్చేందుకు సిద్ధపడ్డా. బిడ్డ ప్రాణం కన్నా నా కిడ్నీ విలువైందేమి కాదు. ఇప్పుడు ఇద్దరం సంతోషంగా ఉన్నాం. నా పనిని నేను చేసుకోగలుతున్నా.

\- పులగం సుదర్శన్, తండ్రి, కిడ్నీ దాత

నా తండ్రి రుణం ఎలా తీర్చుకోవాలో



కిడ్నీ దానం చేసి తనకు పునర్జన్మని ప్రసాదించిన తండ్రి సుదర్శన్ రుణం ఎలాతీర్చుకోవాలో. తన పిల్లలు, కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని కిడ్నీ దానం చేసి దేవుడిలా రక్షించారు. ఆయన్ను దేవుడిలా ఆరాధిస్తా.

\- ఆమని, కుమార్తె

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మొదటి స్థానం

హుజూర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగిన టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పదో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్-17 ఐదో జోన్‌లో మొదటిస్థానం సాధించారు. కబడ్డీ విభాగంలో బెస్ట్ రైడర్‌గా నరేందర్, బెస్ట్ ఆల్‌రౌండర్‌గా చంద్రహరితేజ్ నిలిచారు. అండర్-17 అథ్లెటిక్స్ లాంగ్, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రవీణ్ గోల్డ్ మెడల్ సాధించాడు. అండర్-14 క్యారమ్ విభాగంలో నితిన్ సిల్వర్ మెడల్ సాధించారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ప్రవీణ్, నితిన్‌లు గోల్డ్‌మెడల్ సాధించి గురుకుల పాఠశాలకు గుర్తింపు తెచ్చారు.

హరితహారం పురోగతిలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకం

భువనగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల అభ్యున్నతి, హరితహారం కార్యక్రమ పురోగతిలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు కంకల సిద్దిరాజు అన్నారు. ఆదివారం భువనగిరిలో జిల్లా స్థాయి ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా బబ్బూరి శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బైరగోని రమేశ్ , కోశాధికారిగా జేరిపోతుల ఉపేందర్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, నరేందర్, భిక్షు నాయక్, నర్సింహులును ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బ బ్బూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు చాలిచాలని వేతనాలతో జీవితం గడుపుతున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఐక్యంగా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డులు, పదవులకు వన్నె తెవాలి : ప్రజా సంఘాలు

భువనగిరి గంజ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల స్ఫూర్తితో అవార్డులు, పదవులకు వన్నె తీసుకురావాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఇటీవల ఢిల్లీలో హ్యూమన్ రైట్స్ డిఫెండర్ జాతీయ అవార్డు పొందిన సురుపంగ శివలింగం, భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కనుకుంట్ల బాబురావు, పచ్చలకట్ట సోమేశ్వర ఆలయ చైర్మన్ కొల్లూరి రాజుకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక జగ్జీవన్‌రామ్ భవనంలో ఆదివారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ జ్యోతీరావు పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ బానోత్ భాస్కర్‌నామక్, దళిత ఐక్య వేదిక చైర్మన్ బట్టు రాంచంద్రయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్ జహంగీర్, శ్రీనివాస్, నరసింహ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో సంస్థాగతమెప్పుడో?

(5వపేజీ తరువాయి)

సంస్థాగతంగా జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలను పునురుద్ధరించనున్నట్టు గతంలోనే బీఆర్ఎస్ ప్రకటించింది. సంస్థాగతంగా పార్టీ తరపున తీసుకునే నిర్ణయాలు, కార్యకలాపాలు కూడా జిల్లా కమిటీలకే పూర్తి బాధ్యత ఇచ్చింది. జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసిన కమిటీలు అధిష్ఠానం సూచన మేరకు పనిచేస్తాయని, స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు, ఎంపీల ఒత్తిడి, పెత్తనం ఉండదని గతంలో పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. జిల్లాలో తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన సీనియర్ నేతలతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జిల్లా అధ్యక్షులుగా అధిష్ఠానం ప్రకటించింది. అయితే కార్యవర్గం లేకుండానే సుమారు రెండేళ్లుగా ఏకపక్షంగా అధ్యక్షుడు, మండల కమిటీలతోనే పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

అనుబంధ కమిటీలు ప్రకటించని వైనం

బీఆర్ఎస్ 2022 జనవరి 26న జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. జిల్లా అధ్యక్షుల నియామకాలను సైతం చాలా కాలం వాయిదా వేసి జనవరి 26న పార్టీ అధినేత కేసీఆర్ ఎట్టకేలకు 33 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించారు. ఆ తర్వాత పూర్తిస్థాయి కార్యవర్గం లేదు. పార్టీ జిల్లా అధ్యక్షులు బాధ్యతలు తీసుకున్న అనంతరం పార్టీ అధిష్ఠానంతో చర్చిస్తున్న పలు సందర్భాల్లో జిల్లా కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో నియమించాలని, లేనిపక్షంలో కనీసం పార్టీ అనుబంధ జిల్లా అధ్యక్షులను ప్రకటించాలని అధినేతను కోరారు. అయితే అధిష్ఠానం మాత్రం ఇంతకాలం జిల్లా అధ్యక్షుడితోనే నెట్టుకొని వచ్చింది. బీఆర్ఎస్‌గా అవతరించిన అనంతరం కూడా సంస్థాగత పదవులు పొందలేకపోయామని ఇంతకాలం పార్టీలో ఉన్న నేతల్లో అసంతృప్తి ఉంది. అయితే త్వరలోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ నిర్ణయించినట్టు తెలిసింది.

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి

- నిత్యాదాయం రూ.57.52 లక్షలు

భువనగిరి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండ ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు నిండిపోవడంతో పాటు వైకుంఠ ద్వారం ఇరువైపులా వాహనాలు నిలిపారు. సుమారు 55వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలపగా ఉభయ క్యూలైన్లల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరారు. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ఉచిత దర్శనాలకు రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ప్రధానాలయం, కల్యాణోత్సవ మండపం, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాల, కొండపైన కింద బస్టాండ్లు, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట వద్ద కూడా భక్తుల సందడి నెలకొంది. భక్తులను కొండపైకి తరలించేందుకు రద్దీకి తగినట్లు బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.57,52,702ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి గాలి గోపురానికి స్వర్ణ తాపడానికి హన్మకొండకు చెందిన భక్తులు వాకా సత్యనారాయణ జయలలిత దంపతులు రూ. 5,01,116 నగదు ఈవోకు అందజేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు గోదాదేవి అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేపట్టగా మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



తూర్పు రాజగోపురం వద్ద ఉభయ క్యూలైన్లలో భక్తుల రద్దీ





నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొపిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామి అమ్మవారికి నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వార బంధనం చేశారు.

రాజాపేటకు చేరుకున్న సైకిల్ యాత్ర

రాజాపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హిందూ రాష్ట్ర సాధనకు, జ్యోతిర్లింగాల దర్శనం కోసం ఇద్దరు యువకులు సిద్దయ్యస్వామి, కతం రాజేశ్వర్ చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం రాజాపేటకు చేరుకుంది. జైశ్రీమ్ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆరు నెలల క్రితం చేపట్టిన యాత్ర 10వేల కిలోమీటర్లకు చేరుకుందని స్వామి, రాజేశ్వర్లు తెలిపారు.

వైటీపీఎస్‌లో ఉద్యోగాలేవీ?



(5వ పేజీ తరువాయి)

, తాజా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ప్లాంటు ప్రారంభానికి ముందే ఉద్యోగాలిస్తామని ప్రకటించినా ఇంకా ఇది అమలుకాలేదు.

నెమ్మదిగా సాగుతున్న వివరాల సేకరణ

భూములు కోల్పోయిన వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం, తిమ్మాపురం గ్రామాలకు చెందిన, జాబ్‌కార్డులు పొందిన మరో 440 కుటుంబాల్లో ఉద్యోగాలకు ప్రతిపాదిస్తున్న వారి వివరాలు, విద్యార్హతలు, ధ్రువీకరణ పత్రాల పరిశీలన, నమోదు ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఈ ప్రక్రియ ఎంత వేగంగా ముగిస్తే, అంత త్వరగా ఉద్యోగాల నియామకాలు నిర్వాసిత కుటుంబాలు పొందనున్నాయి. అయితే సర్వే బాధ్యతలు రెవెన్యూశాఖ నిర్వహించాల్సి ఉండడం, ఆ శాఖకు సంబంధించి క్షేత్రస్థాయిలో వీఆర్‌వోలు లేకపోవడం, తహసీల్దారే స్వయంగా ఈ సర్వే నిర్వహించాల్సి రావడంతో ప్రక్రియలో జాప్యమవుతోందని చెబుతున్నారు. ప్రధానంగా ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల సర్వేలు, ధాన్యం కొనుగోళ్లు, ఓటర్ల నమోదు వంటి పనుల ఒత్తిడి ఉండడంతో ఈ సర్వేలో జాప్యం జరుగుతుందని చెబుతున్నారు. సర్వేను వేగవంతంగా పూర్తిచేసి జెన్‌కోకు నివేదిక చేరాక, మళ్లీ విద్యుత్‌శాఖలో ఉన్నతస్థాయిలో ఆమోదం పొందాకే ఉద్యోగాల నియామక ప్రకటన వస్తుంది. విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను నిర్ణయిస్తారని, అవసరమైన వారికి ప్రత్యేక శిక్షణ లేక నైపుణ్యశిక్షణను కూడా అందించిన తర్వాతే ఉద్యోగ బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. ఈ ఉద్యోగాలను నేరుగా రెగ్యులర్ నియామకంగా చేపడతారా? లేక ఒకటి, రెండేళ్ల పాటు ప్రొబేషనరీలో ఉంచుతారా? అనే విషయమూ తేలాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న వివరాల సేకరణ ఎంత వేగంగా పూర్తయితే, మిగిలిన ప్రక్రియ అంత త్వరగా చేపడతారని, ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు.

అర్హులకు త్వరితగతిన ఉద్యోగాలివ్వాలి



యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఇళ్లు, భూములు కోల్పోయాం. మా కుటుంబాల్లో అర్హులైనవారికి ఉద్యోగాలిస్తామని జాబ్‌కార్డులు జారీ చేశారు. పవర్‌ప్లాంట్‌ను ప్రారంభించా రు కానీ ఉద్యోగాలు ఇంకా ఇవ్వలేదు. పవర్‌ప్లాంట్‌లో కాంట్రాక్టర్ల కింద పనిచేస్తున్నవారికి కూడా సకాలంలో వేతనాలివ్వడం లేదు. ప్రభుత్వం వేగంగా స్పందించి ఉద్యోగాలు ఇవ్వాలి.

● హేమానాయక్, కపూర్‌తండా, భూనిర్వాసితుడు

రేపటిలోగా వివరాల సేకరణ

ఈనెల 24లోగా నిర్వాసితుల వివరాల సేకరణ, కుటుంబాల వివరాల నమోదు పూర్తిచేయాలని సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాం. ఇప్పటికే మెజార్టీ నిర్వాసితుల వివరాలు సేకరించాం. సర్వే నిర్వహించిన వారిలో 190 కుటుంబాలకు చెందినవారు, వారి కుటుంబంలో ఎవరికి ఉద్యోగమివ్వాలనే విషయాన్ని తేల్చుకోలేకపోతున్నారు. వారికి కొంత గడువు ఇవ్వాల్సి వస్తోంది. ఈ నెల 24లోగా పూర్తయిన సర్వే మేరకు నివేదికను సబ్‌కలెక్టర్‌కు సమర్పిస్తాం. ఆ తర్వాత ఉన్నతాధికారుల ద్వారా అది జెన్‌కోకు చేరుతుంది. అదేవిధంగా మిగిలిన వారి వివరాలు కూడా త్వరలోనే పూర్తిగా సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రతి నిర్వాసితుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేందుకు ప్రక్రియను పూర్తిచేస్తాం.



● జవహర్‌లాల్, తహసీల్దార్, దామరచర్ల

టీపీసీసీ మునుగోడు నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శంకర్



మర్రిగూడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండలం దామెర భీమనపల్లికి చెందిన జిల్లా శంకర్ మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ టీపీసీసీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా ఎన్నికయ్యారు. కో ఆర్డినేటర్‌గా నగేష్, చండూర్ మండల కోఆర్డినేటర్‌గా రాహుల్, మునుగోడు మండల కోఆర్డినేటర్‌గా చింటు, నాంపల్లి మండల కోఆర్డినేటర్‌గా గణేష్, చౌటుప్పల్ మండల కోఆర్డినేటర్‌గా జగన్ ఎన్నికయ్యారు.

గోవుల పట్టివేత

చింతపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు వ్యాన్‌లో తరలిస్తున్న గోవులను ఆదివారం పట్టుకున్నారు. గొడుకొండ్ల రిజర్వాయిర్ సమీపంలో 12గోవుల వ్యాన్‌లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడికి కలెక్టర్ అభినందన



క్రీడాకారుడు జయశీల్‌కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ , డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్ బాలుర విభాగం 105 కిలోల కేటగిరిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన దాసరి జయశీల్‌కుమార్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారుడితో కలిసి వారు కలెక్టర్‌ను కలిశారు. రాష్ట్రస్థాయిలో రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. శనివారం నల్లగొండలో జరిగిన పవర్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి 105కిలోల బరువు పోటీలో విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెలెక్టర్ అశ్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

లీకేజీ పైప్‌లైన్ తొలగింపు.. కొత్తది ఏర్పాటు



పుష్కరిణి మెట్లపై వేసిన కొత్త పైప్

నార్కట్‌పల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం పుష్కరిణిలోకి అపరిశుభ్ర నీరు చేరి కలుషిత మవుతుందన్న ఆరోపణలపై దేవస్థానం అధికారులు స్పందించారు. పాత ఈవో కార్యాలయం గోడ నుంచి ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్‌కు చిన్న రంధ్రం పడి ఆ నీరంతా పుష్క రిణి మెట్ల మీదుగా ప్రవహించి కోనేరులో కలుస్తుందంటూ దేవాలయాల పరిరక్షణ సమితి ప్రతినిధులు ఆందోళన చేశారు. సమస్యను పరిష్కరించాలని సూచించారు. పుష్కరిణిలో కలిసే నీరు డ్రైనేజీది కాదని ఈవో నవీన్ తెలిపారు. అయినప్పటికీ చాలా ఏళ్ల క్రితం వేసిన ఈ పైప్‌లతో సమస్య ఏర్పడక ముందే వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త పైప్‌లైన్ వేశామన్నారు.

ధనుర్మాసోత్సవాల్లో పారాయణం

చిట్యాలరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడలో సీతారామాంజనేయస్వామి దేవాలయంలో 44వ మార్గళి ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవాలయంలో తిరుప్పావై 7వ పాశురంను పారాయణం గావించారు. 44వ మార్గళి ధనుర్మాసోత్సవాల పూజల సందర్భంగా భక్తులు దేవాలయంలో పెద్దసంఖ్యలో హాజరయ్యారు. తిరుప్పావై 7వ పాశురాం పారాయణం గావించి పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 22, (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం అహంకారానికి నిదర్శనమని, ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పి ంచాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ డిమాండ్ చేశారు. మండలంలోని పుట్టంగండి గ్రామంలో ఆదివారం జరిగిన సంఘం వర్క్‌షాపులో ఆమె మాట్లాడారు. రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలోనే రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. పోలేబోయిన వరలక్ష్మీ అధ్య క్షతన జరిగిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, నాయకులు కొండా అనురాధ, జిట్టా సరోజ, పద్మభూతం, అరుణ, నాగమణి, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చేయూత

సీఎం రిలీఫ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేస్తున్న నాయకులు

శాలిగౌరారం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు పేదలకు వరమని మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య అన్నారు. మండలంలోని అడ్లూర్ గ్రామానికి చెందిన బట్ట బిక్షంకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోడ విజయ్, నిమ్మల కృష్ణయ్యగౌడ్, గరిగంటి శంకర్, బోడ అరుణ్‌కుమార్, ఉబ్బని వెంకన్న, బోడ సైదులు, వానరాశి వెంకన్న, వానరాశి యాదగిరి, గోనే రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మునుగోడు రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటామని వెదిరే పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిరే మెగారెడ్డి, కొంపల్లి రామాలయ కమిటీ చైర్మన్ వెదిరే విజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన జడీమడ్ల శోభ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా వారి కుటుంబానికి రూ.15వేలు అందజేశారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బోయపర్తి లింగయ్య, ముగుదాల శివయ్య గౌడ్, జడీమడ్ల దశరథ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 100 పడకల ఆస్పత్రి ప్రారంభం : ఎమ్మెల్యే



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, డిసెంబర్ 22(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో త్వరలో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. ఆదివారం నకిరేకల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కేతేపల్లి, కట్టంగూరు మండలాలకు మంజూరైన అంబులెన్స్ 108 వాహనాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ప్రాణ దాతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఉన్న కాలంలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ మంజూరు చేశారని గుర్తు చేశారు. 10 సంవత్సరాల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 108 సేవలను విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మునిసిపల్ చైర్మన్ చెవుగోని రజిత శ్రీనివాస్, నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలి



కేతేపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు లింగయ్య

కేతేపల్లి, డిసెంబరు 22: కార్యకర్తలు గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతెపాక లింగయ్య కోరారు. మండలకేంద్రంలో ఆదివారం జరిగిన బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి రావడానికి అవసరమైన పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు చినేని జానయ్య, మండల వెంకన్న, సాయన్న, వేణుగోపాల్‌రెడ్డి, జి.కృష్ణ, పి.వెంకట్, పద్మ, బూత్ కమిటీల అధ్యక్షులు బి. సుధాకర్, ఆర్. శ్రీనివాస్ ఉన్నారు.

చిట్యాలరూరల్, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నాయకులు కార్యకర్తలు ప్రచారం చేయాలని బీజేపీ మండల ఇన్‌చార్జి పీక వెంకన్న అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లిలో ఆదివారం జరిగిన పార్టీ బూత్‌కమిటీల సమావేశంలో మాట్లాడారు. దేశాభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రమిస్తున్నారన్నారు. దేశాభివృద్ధిని అనేక సంస్కరణలతో దేశ పురోభివృద్ధితో ప్రపంచంలో భారతదేశం అగ్రస్థానంలో నిలిచేలా కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో బొడిగె లక్ష్మయ్య పెద్దగోని అంజన్, గరిషె నరేష్, పావని వాసుదేవ్, సోమగోని నర్సింహ, రాచకొండ నరేష్, మైల పరమేష్ రాచకొండ మల్లేష్, సిందం లింగస్వామి, నీల నర్సింహ, బుస్సు నర్సింహ, నల్లగంటి సైదులు, రమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సదుపాయాల కోసం పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్, వేదికపై సంఘ నాయకులు

నల్లగొండ రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ ఉద్యోగుల రావాల్సిన సదుపాయాల కోసం పోరాటం చేస్తామని ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన ఎస్‌బీఐ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు, కస్టమర్ల సేవలు అందించే విషయంలో రాజీ పడవద్దన్నారు. కష్టమర్లకు బ్యాంకు ఉద్యోగులు మెరుగైన సేవలు అందిస్తే బ్యాంకులు అభివృద్ధి చెందుతాయన్నారు. బ్యాంకులతో పాటు అభివృద్ధికి పాటుపడినందు ఉద్యోగులకు రావాల్సిన సదుపాయాలు అందుతాయన్నారు. యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్నందున ఆయనను సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముందుగా ఎస్‌బీఐ ఉద్యోగులు పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్ నుంచి సాగర్ రోడ్డులోని ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నినాదాలు ఇస్తు ర్యాలిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రీజనల్ కార్యదర్శి సరిగి నర్సింహాగౌడ్, అసిస్టెంట్ రీజనల్ కార్యదర్శి కుమార్, ట్రెజరర్ శాండిల్య, ప్రవిణ్ పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీగా వెళ్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ





పలివెలలోమహాపూడిపూజలో స్వామివారికి అభిషేకం, చర్లపల్లిలో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి

మునుగోడు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మహాపడి పూజ, అగ్నిగుండాల కార్యక్రమం మండలంలోని పలివెల గ్రామంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కేరళ తాంత్రిక ఆచార్య ప్రదీప్ గురుస్వామి, విఘ్నేశ్వరస్వామి ఆధ్వర్యంలో 12వ అగ్నిగుండాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్పశివ స్వాముల అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో గురుస్వాములు చెరుకు శంకర్, పాలకూరి కనకయ్య, తిలింగస్వామి పాల్గొన్నారు.

● నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని చర్లపల్లిలో జరిగిన మహాపడి పూజ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి హాజరయ్యారు. స్వామి వారికి నిర్వహించిన అభిషేకంలో ఇరువురు పాల్గొన్నారు. పడిపూజ అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది.

బస్సు జాతాను విజయవంతం చేయాలి

శాలిగౌరారం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25వ తేదీన నల్లగొండలో నిర్వహించే బస్‌జాతా, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బల్లెం నవనీత, గుండ్ల సైదమ్మ కోరారు. ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల ఆశా వర్కర్లతో కలిసి బస్సుజాతా పోస్టర్లు ఆవిష్కరించారు. నెలకు రూ.18వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఎస్.రేణుక, చిలుక గణపతి, వై.ధనలక్ష్మి, కె.జయమ్మ, కె.ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ లైన్‌మన్ మల్లేష్ మృతి



శాలిగౌరారం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకారం గ్రామానికి చెదిన రిటైర్డ్ లైన్‌మన్ గోదాస్ మల్లేష్(60) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. మల్లేష్ వివిధ ప్రాంతాల్లో సేవలు అందించారు. మల్లేష్ మృతి పట్ల విద్యుత్ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందాల సమరంరెడ్డి మల్లేష్ మృతదేహంపై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

26న మహా మండల పూజ



కట్టంగూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని సాయి మణికంఠ దేవాలయంలో ఈ నెల 26న నిర్వహించే పంచమ దశ మహా మండల పూజ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని నిర్వహా కులు కోరారు. దేవాలయంలో ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెల్లా ముత్తిలింగం, దేవాలయ అధ్యక్షుడు పోగుల నర్సింహ, వంగూరి లక్ష్మయ్య(పూల స్వామి), గుడిపాటి ప్రసాద్, గాదగోని వెంకన్న, పూల స్వామి, పరమేష్, రాంబాబు, సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

కట్టంగూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషిచేయాలని బీజేపీ మండల కార్యదర్శి గున్నాల నాగరాజు తెలిపారు. కట్టంగూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి కార్యకర్త పట్టుదలతో పనిచేయాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు బత్తిని నాగరాజు, సంతోష్ రెడ్డి, పెద్ది సతీష్, ఐతగోని శివ తదితరులు ఉన్నారు.

మాల మహానాడు మండల అధ్యక్షుడిగా వెంకటేష్



చిట్యాల, డిసెంబరు 22,(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు మండల అధ్యక్షుడిగా చిట్యాలకు చెందిన దాసరి వెంకటేష్ నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు తాళ్ళపల్లి రవి ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరి ంచిన సంఘం నాయకులకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

చిట్యాలరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్రాంపల్లి 62, 63, 64 బూత్ బీజేపీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. 62వ బూత్ అధ్యక్షుడిగా సోమగోని నర్సింహ, 63వ అధ్యక్షుడిగా రాచకొండ నరేష్, 64వ అధ్యక్షుడిగా మైల పరమేష్‌ను ఎన్నుకున్నారు. తమ నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ డైరెక్టర్‌కు సన్మానం

కేతేపల్లి, డిసెంబరు 22: నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన కేతేపల్లికి చెందిన బయ్య ముత్తయ్యను ఆదివారం రాత్రి స్థానిక యాదవ యువసేన ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం, వివిధ పార్టీల నాయకులు జె.వెంకటనర్సయ్యయాదవ్, జె.రామచంద్రయ్య, జె.నాగయ్య, బయ్య వెంకన్న, బయ్య సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి వర్ధంతి

కనగల్, డిసెంబరు 22: (ఆంధ్రజ్యోతి) మాజీ ఎంపీ దివంగత గడ్డం వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ప్రమాణ స్వీకార వేడుక




ప్రమాణ స్వీకారం చేస్తున్న అర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు

జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్ ఆదివారం అర్యవైశ్య సంఘం మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన కార్యవర్గాలు ప్రమాణస్వీకారం చేశాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్యవైశ్య సంఘాల బాధ్యులు తరలివచ్చారు.



ప్రమాణ స్వీకార కార్య క్రమానికి హాజరైన మహిళలు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 23 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 , కనిష్ఠం 19.0



వైటీపీఎస్‌లో ఉద్యోగాలేవీ?

యాదాద్రి థర్మల్‌పవర్ ప్లాంట్ నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం ఇచ్చే ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్లాంటు ప్రారంభానికి ముందే ఉద్యోగాలిస్తారని ఆశించినా, అధికారికంగా ప్రారంభించిన తర్వాత కూడా ఉద్యోగకల్పన ప్రక్రియ పూర్తి చేయకపోవడంపై నిర్వాసిత కుటుంబాల్లో అసంతృప్తి నెలకొంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనా నిర్వాసితుల ఎదురుచూపు
- 573 మందికి ఇప్పటికే ఉద్యోగ హామీపత్రాలు
- ఇళ్లు కోల్పోయిన 133 గిరిజన కుటుంబాల్లో అర్హుల వివరాల సేకరణ పూర్తి
- అయినా అందని నియామక పత్రాలు
- నత్తనడకన సాగుతున్న ప్రక్రియ

యాదాద్రి థర్మల్ ప్లాంట్ శంకుస్థాపన సమయంలో అప్పటి సీఎం కేసీఆర్ నిర్వాసితులు, భూములు కోల్పోయినవారికి ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలిసారి పవర్‌ప్లాంటును సందర్శించిన డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సైతం నిర్వాసితుల త్యాగాన్ని గుర్తించి ఉద్యోగాలిస్తామని, భూములు కోల్పోయినవారికి ఉద్యోగాలివ్వడం కనీస బాధ్యత అని పేర్కొనడమేగాక ఆ ప్రక్రియను చేపట్టాలని జెన్‌కో, రెవెన్యూ అధికారులను పురమాయించారు. నిర్వాసితులకు ఉద్యోగాలిచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నా, అర్హులను తేల్చే ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండడం విమర్శలకు తావిస్తోంది.

573 మందికి ఉద్యోగహామీ కార్డులిచ్చిన ప్రభుత్వం

యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లో ఇళ్లు, భూములు కోల్పోయిన వారిలో 573 మందికి ఉద్యోగాలిస్తామనే హామీతో ఉద్యోగహామీ కార్డులను (జాబ్‌కార్డులు) ప్రభుత్వం ఇప్పటికే జారీచేసింది. ఇళ్లు, భూములు రెండూ కోల్పోయిన వీర్లపాలెం శివారు గిరిజనతండాలైన మోదుగులకుంట, కపూర్‌తండాలలోని 173 కుటుంబాలకు, అదేవిధంగా భూములు కోల్పోయిన మరో 440 కుటుంబాలకు ఉద్యోగాలిస్తామని ప్రకటించింది. అయితే ఉద్యోగాలు వదులుకుంటే ఆ కుటుంబానికి రూ.5లక్షల పరిహారం ఇస్తామని ప్రకటించడంతో మోదుగులకుంటతండా, కపూర్‌తండాలకు చెందిన 40 కుటుంబాల వారు పరిహారం తీసుకొని ఉద్యోగాలు వదులుకున్నారు. దీంతో ఈ తండాలకు చెందిన 133మందికి, భూములు కోల్పోయిన వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం (కొత్తపల్లి), తిమ్మాపురం గ్రామాలకు చెందిన మరో 440 కుటుంబాలకు కలిపి మొత్తం 573మందికి జాబ్‌కార్డులను గతంలోనే అందజేశారు. వీరికి అప్పటి ప్రభుత్వం

- మిగతా 8వ పేజీలో...

అటవీభూములను సాగుచేసిన వారిపై తేలని నిర్ణయం

పవర్‌ప్లాంటులో సేకరించిన భూముల్లో అటవీభూముల్లో పట్టాలు పొందిన (ఆర్‌వోఎఫ్‌ఆర్) గిరిజనులకు పరిహారమైతే ఇచ్చారు కానీ, వారికి ఉద్యోగాలిచ్చే విషయంలో ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ భూములు కోల్పోయిన రైతులు మరో 200 మంది వరకు ఉన్నారు. భూములు కోల్పోయిన కుటుంబీకులు వారికి సైతం తమ కుటుంబాల్లో అర్హులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వీరికి ఉద్యోగాలిచ్చే విషయంలో ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో వీరు ఆందోళనలు నిర్వహిస్తున్నారు.



కొందరిని అర్హులుగా తేల్చినా, ఉద్యోగాల ప్రకటనలో జాప్యమే

ఉపముఖ్యమంత్రి, మంత్రుల ఆదేశాల మేరకు తొలిదశలో ప్లాంటులో ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన వారి కుటుంబాల్లో అర్హులను గుర్తించారు. అందుకోసం అక్టోబరు, నవంబరు నెలల్లో రెవెన్యూ అధికారులు మోదుగులకుంటతండా, కపూర్‌తండాలకు చెందిన జాబ్‌కార్డులు పొందిన 133 కుటుంబాల్లో ఉద్యోగానికి ప్రతిపాదిస్తున్న వారి విద్యార్హతల పత్రాలు, నివాస పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లను పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఈ సర్వే వివరాలను జెన్‌కోకు సైతం అందజేశారు. డిప్యూటీ సీఎం మల్లుభట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించిన ప్రకారం మొదటి విడతలో ఈ 133 మందికి ఉద్యోగ నియామకాలు ఇవ్వాల్సి ఉంది. వీరికి ఎలాంటి విద్యార్హతలున్నా, అవసరమైనవారికి నైపుణ్యశిక్షణ కూడా అందజేయాలని ప్లాంటు పర్యటన సందర్భంగా డిప్యూటీ సీఎం జెన్‌కోను ఆదేశించారు. ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉన్నా, తొలిదశలో ప్రకటించినవారికైనా ఉద్యోగాల నియామకాలు చేపట్టకపోవడంపై అర్హులైనవారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్ఎస్‌లో సంస్థాగతమెప్పుడో?

- జిల్లా అధ్యక్షుల ప్రకటనతోనే సరి
- కార్యవర్గంతో పాటు అనుబంధ కమిటీలు నియమించని వైనం

(ఆంధ్రజ్యోతి, యాదాద్రి): టీఆర్ఎస్‌గా ఉన్నప్పుడు 2014కు ముందు పార్టీ సంస్థాగతంగా కీలకంగా వ్యవహరించి, ఎప్పటికప్పుడు పదవులు కేటాయిస్తూ, పర్యవేక్షిస్తూ ఉండేది. జిల్లా కమిటీలు బలోపేతంపై నిరంతరం అధ్యయనం చేసేది. అయితే అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యేలకు పూర్తి అధికారాలు బదలాయించి, ఇప్పటివరకు సంస్థాగతంగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేయలేదు. బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయి ఏడాది గడిచింది. ఈ నేపథ్యంలో సంస్థాగత ఎన్నికలపై పార్టీ అధిష్ఠానం దృష్టిసారించి జిల్లా, అనుబంధ కమిటీలు నియమించే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతం చేసే దిశగా పార్టీ అడుగులు వేస్తోంది.

జిల్లా అధ్యక్షులతోనే సరి

టీఆర్ఎస్‌ను భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారుస్తూ, జాతీయ రాజకీయాల్లోకి పార్టీ అరంగేట్రం చేసింది. జాతీయ పార్టీగా ఆవిర్భవించిన అనంతరం సంస్థాగత పదవులపై బీఆర్ఎస్ నేతల్లో ఆశలు రేకెత్తాయి. 2022 జనవరి 26న అధిష్ఠానం 33 జిల్లాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల రామకృష్ణారెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా దేవరకొండ నాటి ఎమ్మెల్యే రవీంద్రనాయక్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా నాటి రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌ను అధిష్ఠానం పార్టీ నియమించింది. అయితే జిల్లా అధ్యక్షులకే పరిమితం చేసిన అధిష్ఠానం అనుబంధ సంఘాలకు పూర్తి స్థాయి కార్యవర్గాన్ని నియమించలేదు.

పునరుద్ధరణకు నోచుకోని కమిటీలు

జిల్లాల్లో అన్ని రాజకీయ పార్టీలకు సంస్థాగతంగా కమిటీలు ఉన్నాయి. ఏడేళ్ల క్రితం టీఆర్ఎస్ అధిష్ఠానం జిల్లా కమిటీలను రద్దు చేసింది. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో రాష్ట్ర కార్యదర్శులకు పార్టీ వ్యవహారాలను అప్పగించింది. నియోజకవర్గాల్లో పార్టీ పరంగా తీసుకునే కీలక నిర్ణయాలపై సర్వ అధికారాలు ఎమ్మెల్యేలకు అప్పగించింది. ఎమ్మెల్యేలతో పొసగని సీనియర్ నేతలు కొంతకాలంగా రాజకీయపరంగా నిశ్శబ్దంగా ఉన్నారు. నియోజకవర్గాల్లో నిర్వహించే పలు పార్టీ కార్యక్రమాలకు హాజరవుతూ, పార్టీలోనే కొనసాగుతున్నారు. మరోవైపు ద్వితీయ శ్రేణి నేతలకు రాజకీయంగా తీసుకునే నిర్ణయాల్లో అవకాశం కల్పించకపోవడంతో, వారు ఎదగలేకపోయారని అధిష్ఠానం గ్రహించింది. విభేదాలు సమసిపోవాలంటే పార్టీని జిల్లా కమిటీలకే అప్పగించాలని నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో

- మిగతా 7వ పేజీలో...

ప్రజలకు సేవలు అందించాలి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహాసభ ద్వారా ప్రజలకు సేవలు అందించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరై ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యుల్లో దైవభక్తితో పాటు సహాయం చేసే గుణం ఉంటుందన్నారు. దేవాలయాలకు, అన్నదాన సత్రాలకు ఆర్యవైశ్యులు విరివిరివిగా విరాళాలు ఇస్తూ సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణానికి ఎకరం స్థలాన్ని ప్రభుత్వం నుంచి ఇప్పించేందుకు మంత్రి కోమటిరెడ్డి సహకారంతో కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం పేద ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, దానికి నిధులు కూడా మంజూరు చేయనుందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకవస్తే సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, నూతన కార్యవర్గం బలోపేతం కోసం, ఆర్యవైశ్య పేదలకు సహకారం అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, భాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓపెన్ స్కూల్ వరం

రాష్ట్ర కోఆర్డినేటర్ అరుణశ్రీ



ప్రభుత్వ జూనియర్ బాలికల కళశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అరుణశ్రీ

నల్లగొండ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చదువును మధ్యలో నిలిపివేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ వరమని ఓపెన్ స్కూల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అరుణశ్రీ అన్నారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కల్లూరి సత్తమ్మతో కలిసి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఇంటర్ కళాశాలలోని ఓపెన్ స్కూల్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పలు కారణాలతో చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ విద్యను పూర్తి చేయవచ్చన్నారు. వారికి ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తుందన్నారు.

ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ పూర్తిచేసినా, రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా గుర్తింపు ఉంటుందన్నారు. డిగ్రీ, పీజీలతో పాటు అన్ని ప్రభుత్వ నియామకాలకు అర్హత ఉందన్నారు. చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థులు నిరాశ చెందకుండా భవిష్యత్‌కు ఓపెన్ స్కూల్ ద్వారా బంగారు బాటలు వేసుకోవాలన్నారు. వారి వెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సుధారాణి, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

నల్లగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వంటావార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఆలోగా పేస్కేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇక సమగ్ర శిక్ష ఉద్యోగులకు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రాజకీయ నాయకుల మద్దతు పలికారు.

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు :మంత్రి వెంకట్‌రెడ్డి



గుట్టలో గాంధీ గ్లోబల్ సదస్సులో రైతును సన్మానిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, కుంభం

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సుస్థిర విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ల ఆగమనంతో దేశంలో ఇప్పటికే సగం పల్లెటూళ్లు పల్లెదనం కోల్పోయాయన్నారు. తమ ప్రజా ప్రభుత్వం రైతన్న బతుకు బాగు చేయాలని 25లక్షల మందికి రూ.2లక్షల చొప్పున రుణమాఫీ చేసిందని, ఉచిత విద్యుత్ పథకాన్ని ఇచ్చి అండగా ఉందన్నారు. ప్రభుత్వం సంక్రాంతికి రైతు భరోసా ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. 10 రాష్ట్రాల్లో సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేసిన 115మంది రైతు జంటలకు పుడమిపుత్ర అవార్డులు, 35మంది అధికారులు, శాస్త్రవేతలు, జర్నలిస్టులకు కిసాన్‌సేవా అవార్డులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సైన్స్‌ఫెయిర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామలకిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఆలేరు, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్లు చైతన్యరెడ్డి, అవేస్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, పడమటి పావని, మెరుగు మధు, మాటూరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

- నేడు నిరసన ర్యాలీ
- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, చిత్రంలో బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ ర్యాలీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఆయన వ్యాఖ్యలు దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. అంబేడ్కర్ అందరివాడని, బడుగు, బలహీన వర్గాలు, దళిత సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన సారథ్యంలో రూపొందిన రాజ్యాంగంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, క్రైస్తవులు, మైనార్టీలు, అణగారిన వర్గాలపై దాడులు పెరిగాయని విమర్శించారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ తమ నాయకుడు రాహుల్‌గాంధీ కూడా పార్లమెంటులో ఆందోళన చేశారన్నారు. కాంగ్రెస్ అన్ని మతాలను గౌరవిస్తుందని, కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల సంక్షేమం ధ్యేయంగా పనిచేసిందని గుర్తుచేశారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు నంద్యాల వీరబ్రహ్మానందారెడ్డి, పిల్లి రమేష్‌యాదవ్, కిన్నెర అంజి, పేర్ల ఈశ్వర్, పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్

నల్లగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 90శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో డీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరణ నిరాహార దీక్ష మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గడియారం సెంటర్‌లో జరిగిన రాస్తారోకో, నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు ఐదు డిమాండ్లు ఉంచామని, వీటిని వెంటనే నెరవేర్చాలన్నారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంతో పాటు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్, కొండేటి నరేష్, అల్లంపల్లి కొండన్న, కాసర్ల లింగస్వామి, గంట సుమంత్, సుజిత్, నరేష్, మహేందర్, వెంకన్న, గిరి, ఎల్లయ్య, మహేశ్వరాచారి, కృష్ణయ్య, వినోద్, సురేష్, సుధాకర్, పరమేష్, మహేష్, సైదులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలకు బ్రేక్ లేదా?

- దేవరకొండలో కనిపించని స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్స్ పాయింట్లు
- దర్గా ఉర్సు వద్ద జనంపైకి దూసుకెళ్లిన డీసీఎం
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావుడి

7

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి

- స్వామివారిని దర్శించుకున్న 55వేల మంది భక్తులు
- నిత్య ఆదాయం రూ.57.52లక్షలు

7

నాయకుల నోట గందమల్ల మాట

- అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేల ప్రస్తావన

వైటీపీఎస్‌లో ఉద్యోగాలేవీ?



(5వ పేజీ తరువాయి)

, తాజా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ప్లాంటు ప్రారంభానికి ముందే ఉద్యోగాలిస్తామని ప్రకటించినా ఇంకా ఇది అమలుకాలేదు.

నెమ్మదిగా సాగుతున్న వివరాల సేకరణ

భూములు కోల్పోయిన వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం, తిమ్మాపురం గ్రామాలకు చెందిన, జాబ్‌కార్డులు పొందిన మరో 440 కుటుంబాల్లో ఉద్యోగాలకు ప్రతిపాదిస్తున్న వారి వివరాలు, విద్యార్హతలు, ధ్రువీకరణ పత్రాల పరిశీలన, నమోదు ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఈ ప్రక్రియ ఎంత వేగంగా ముగిస్తే, అంత త్వరగా ఉద్యోగాల నియామకాలు నిర్వాసిత కుటుంబాలు పొందనున్నాయి. అయితే సర్వే బాధ్యతలు రెవెన్యూశాఖ నిర్వహించాల్సి ఉండడం, ఆ శాఖకు సంబంధించి క్షేత్రస్థాయిలో వీఆర్‌వోలు లేకపోవడం, తహసీల్దారే స్వయంగా ఈ సర్వే నిర్వహించాల్సి రావడంతో ప్రక్రియలో జాప్యమవుతోందని చెబుతున్నారు. ప్రధానంగా ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల సర్వేలు, ధాన్యం కొనుగోళ్లు, ఓటర్ల నమోదు వంటి పనుల ఒత్తిడి ఉండడంతో ఈ సర్వేలో జాప్యం జరుగుతుందని చెబబుతున్నారు. సర్వేను వేగవంతంగా పూర్తిచేసి జెన్‌కోకు నివేదిక చేరాక, మళ్లీ విద్యుత్‌శాఖలో ఉన్నతస్థాయిలో ఆమోదం పొందాకే ఉద్యోగాల నియామక ప్రకటన వస్తుంది. విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను నిర్ణయిస్తారని, అవసరమైన వారికి ప్రత్యేక శిక్షణ లేక నైపుణ్యశిక్షణను కూడా అందించిన తర్వాతే ఉద్యోగ బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. ఈ ఉద్యోగాలను నేరుగా రెగ్యులర్ నియామకంగా చేపడతారా? లేక ఒకటి, రెండేళ్ల పాటు ప్రొబేషనరీలో ఉంచుతారా? అనే విషయమూ తేలాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న వివరాల సేకరణ ఎంత వేగంగా పూర్తయితే, మిగిలిన ప్రక్రియ అంత త్వరగా చేపడతారని, ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు.

అర్హులకు త్వరితగతిన ఉద్యోగాలివ్వాలి



యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఇళ్లు, భూములు కోల్పోయాం. మా కుటుంబాల్లో అర్హులైనవారికి ఉద్యోగాలిస్తామని జాబ్‌కార్డులు జారీ చేశారు. పవర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు కానీ ఉద్యోగాలు ఇంకా ఇవ్వలేదు. పవర్‌ప్లాంట్‌లో కాంట్రాక్టర్ల కింద పనిచేస్తున్నవారికి కూడా సకాలంలో వేతనాలివ్వడం లేదు. ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలి.

● హేమానాయక్, కపూర్‌తండా, భూనిర్వాసితుడు

ఈ నెల 24లోగా వివరాల సేకరణ



ఈనెల 24లోగా నిర్వాసితుల వివరాల సేకరణ, కుటుంబాల వివరాల నమోదు పూర్తిచేయాలని సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాం. ఇప్పటికే మెజార్టీ నిర్వాసితుల వివరాలు సేకరించాం. సర్వే నిర్వహించిన వారిలో 190 కుటుంబాలకు చెందినవారు, వారి కుటుంబంలో ఎవరికి ఉద్యోగమివ్వాలనే విషయాన్ని తేల్చుకోలేకపోతున్నారు. వారికి కొంత గడువు ఇవ్వాల్సి వస్తోంది. ఈ నెల 24లోగా పూర్తయిన సర్వే మేరకు నివేదికను సబ్‌కలెక్టర్‌కు సమర్పిస్తాం. ఆ తర్వాత ఉన్నతాధికారుల ద్వారా అది జెన్‌కోకు చేరుతుంది. అదేవిధంగా మిగిలిన వారి వివరాలు కూడా త్వరలోనే పూర్తిగా సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రతి నిర్వాసితుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేందుకు ప్రక్రియను పూర్తిచేస్తాం.

● జవహర్‌లాల్, తహసీల్దార్, దామరచర్ల

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

దొంగతనాల నివారణకు రాత్రివేళ గస్తీ

● సతీష్, ఎస్ఐ చందంపేట



మండలంలో దొంగతనాల నివారణకు రాత్రివేళలో గస్తీ నిర్వహిస్తున్నామని చందంపేట ఎస్ సతీష్ తెలిపారు. ప్రధాన రహదారులపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దొంగతనాల నివారణకు చేపట్టిన చర్యలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- (చందంపేట, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ: మండలంలో దొంగతనాల నివారణకు రాత్రివేళలో గస్తీలు నిర్వహించడంతోపాటు ప్రధాన రహదారులపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో, జీపు డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి సూచనలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాలపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు.

ఎస్ఐ: ఆర్థిక, సైబర్ నేరాలపై యువత, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం అందులో భాగంగా మిషన్ పరివర్తన్ కార్యక్రమం చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: పీడీఎస్ బియ్యం, బెల్లం, ఇసుక అక్రమ రవాణాపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ: ఇటీవల పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం అందిన వెంటనే దాడులు చేస్తున్నాం. బెల్లం, ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: మండల ప్రజలకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

ఎస్ఐ: ఏ మారుమూల ప్రాంతంలోనైనా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా వెంటనే 100 డయల్ చేయాలి. సంఘటన స్థలాలకు చేరుకొని సమస్యలు పరిష్కరిస్తాం.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు బంటు కవిత, చోగొండి మురళీయాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గురుకుల బాలుర హాస్టల్‌లో భోజనాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మెనూ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్, రాజన్న, అనూష, సంజీవ్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతాం

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు కృషిచేస్తామని మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. మురుగు కాల్వలను విస్తరించాలని కోరుతూ పట్టణంలోని వివేకానంద కాలనీవాసులు చైర్మన్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలో అంతర్గత భూగర్భ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయన్నారు. పలు వార్డుల్లో మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, పెద్దులు, లక్ష్మారెడ్డి, కృష్ణ, నాగునాయక్, శ్రీను పాల్గొన్నారు.

పీవీ రావు ఆశయాలు సాధించాలి

నాగార్జునసాగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దళితుల ఐక్యత కోసం పోరాడిన పీవీ రావు ఆశయాలు సాధించాలని మాలమహానాడు నాయకులు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సాగర్ హిల్‌కాలనీలో ఆదివారం పీవీరావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటేశ్వర్‌రావు, బాబురావు, సుబ్బయ్య, రవీంద్ర భూపతి, విజయ్‌కుమార్, నాగేందర్, శ్రీను, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

చందంపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అమలుకాని హామీలిచ్చి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని బీఆర్ఎస్ నాయకుడు జర్పుల లోక్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ఇప్పటివరకు రైతుభరోసా జమకాలేదని, ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా నేటివరకు పింఛన్లు పెంచలేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు గోసుల శివ, జబ్బు తిరుపతయ్య, శ్రీశైలం, సత్తయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా శోభన్‌బాబు



హాలియా, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా అనుముల మండలం పేరూరు గ్రామానికి చెందిన కొండూరు శోభన్‌బాబు ఎన్నికయ్యారు. నల్లగొండలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు చిట్టిపోలు యాదగిరి, చిట్టిపోలు వెంకటేశ్వర్లు, వెంపటి శ్రీనివాస్, పాంపాటి శ్రీనివాస్, చీదళ్ల లింగయ్య, తెలపోలు శేఖర్, వీరమళ్ల కృష్ణయ్య, కొత్తమాస్ శ్రీనివాస్, బచ్చు సతీష్, వెంకన్న, మంచుకొండ వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. డైమండ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 ఉమ్మడి జిల్లా చెస్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో చెస్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచే చెస్ జీవితంలో ఆటుపోట్లను ఎదుర్కొనే శక్తిని ఇస్తుందన్నారు. అకాడమీ నిర్వాహకులు మాశెట్టి దివ్య మాట్లాడుతూ పోటీలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరుకావడం ఉత్సాహంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మిల్లర్ల సంఘం నాయకుడు కర్నాటి రమేష్, డైమండ్ శ్రీనివాస్, అరవింద్, రాము తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో బంగారు పతకం సాధించిన క్రీడాకారులు దీపక్‌నాయుడు, రాంచరణ్‌లను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ, గోవర్ధనాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ కళాకారులకు అవార్డులు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో ప్రతిభ కనబర్చిన మిర్యాలగూడ పట్టణానికి చెందిన కళాకారులు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా నాటిక సమాజాల సమాఖ్య వ్యవస్థాపకులు తడకమళ్ల రాంచందర్‌రావు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'రావణ' పద్య నాటికకు నాలుగు అవార్డులకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. ఉత్తమ నటుడిగా బోయినపల్లి భుజంగరావు, ఉత్తమ సహాయ నటులుగా పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, ఉత్తమ సంగీతం సురభికొండలరావు, వ్యక్తిగత ఉత్తమ జ్యూరీగా కంబాల శ్రీనివాస్ బహుమతులు అందుకోవడం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పులి కృష్ణమూర్తి, ఆకుల సదానందం, పాండవుల హరిప్రసాద్, పరమేశం తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న మిర్యాలగూడ కళాకారులు

ఉద్యోగ నియామకాల ప్రకటన హర్షనీయం

మిర్యాలగూడ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో పాటలు పాడి, కళలతో ప్రజలను చైతన్యవంతం చేసిన కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామనడం హర్షణీయమని నిరుద్యోగ కళాకారుల రాష్ట్ర నాయకుడు రామ కమల్‌హసన్ అన్నారు. స్థానిక ఎన్నెస్పీ క్యాంపు ఆవరణలోని అమరవీరుల స్థూపం వద్ద మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల కళాకారుల ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించిన నిజమైన కళాకారులను ఎందరినో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రకారం శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మహేశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరడం, ప్రభుత్వం ఆమోదించడం హర్షణీయమన్నారు. నిరుద్యోగ కళాకారుల ఐక్యవేదిక నాయకులు కందుకూరి సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ప్రయత్నిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, మంత్రి జూపల్లి కృష్ణారావు, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు అమరారపు తిరుమలేష్, ఎనివాస్, ఆదిమల్ల ఎల్లయ్య, శిరసవాడ సత్యనారాయణ, నకిరేకంటి వేణు, వలదాసు మధు, పగడాల సతీష్ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కళాకారులు

అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత: రవీంద్ర



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మహాలక్ష్మమ్మ జాతర సందర్భంగా మండలంలోని తెల్‌దేవరపల్లిలో పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో యాసాని రాజవర్ధన్‌రెడ్డి, జర్పుల లోక్యానాయక్, మోహన్‌కృష్ణ, గోవర్ధన్, తులసిరాం తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ, (ఆంధ్రజ్యోతి): దైవభక్తి కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ అయ్యప్పస్వామి దేవాలయంలో జరిగిన అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గురుస్వామి చంద్రమౌళి, నాగేశ్వర్‌రావు, నీల రవికుమార్, మోహనకృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18వేల వేతనం ఇవ్వాలి

హాలియా, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ప్రభుత్వం రూ.18వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు డిమాండ్ శారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 31వ తేదీన వకు జీపుజాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 25వ తేదీన జీపుజాతా నల్లగొండకు చేరుకుంటుందని తెలిపారు. ఆశా కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కరోనా సమయంలో ఆశా కార్యకర్తలు ప్రాణాలు సైతం లెక్క లేకుండా ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. అధికారంలోకి వస్తే రూ.18వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు వెంకటమ్మ, జహీరా, లక్ష్మి, పార్వతి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆశా కార్యకర్తలు

అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలి

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 22, (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం అహంకారానికి నిదర్శనమని, ఆయనను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ డిమాండ్ చేశారు. మండలంలోని పుట్టంగండి గ్రామంలో ఆదివారం జరిగిన సంఘం వర్క్‌షాపులో ఆమె మాట్లాడారు. రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలోనే రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. పోలేబోయిన వరలక్ష్మీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, కొండా అనురాధ, జిట్టా సరోజ, పద్మభూతం, అరుణ, నాగమణి, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హాలియా, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హాలియా పట్టణంలోని న్యూకిడ్స్ పాఠశాలలో నాగార్జున ఉన్నత పాఠశాలకు చెందిన 2007-08 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 16 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన నాటి గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. తమతో పాటు చదువుకొని ఆకాల మరణం చెందిన పూర్వ విద్యార్థులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో శివ, రాజశేఖర్, మహేష్, రమ్య, మౌనిక, రేణుక, సబియా, తదితరులు పాల్గొన్నారు.

గోవులు తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

చింతపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు వ్యాన్‌లో తరలిస్తున్న గోవులను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. గొడుకొండ్ల రిజర్వాయిర్ సమీపంలో 12గోవుల వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి

డిండి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవక్లాపూర్ గ్రామంలో ఆదివారం గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో ఐదు గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన కుందేళ్ల తిరుపతయ్య, బొడ్డు లక్ష్మమ్మలకు చెందిన ఐదు గొర్రెలపై వీధి కుక్కలు దాడిచేసి చంపివేశాయి. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని గొర్రెల కాపర్లు తెలిపారు. గొర్రెల విలువ రూ.60వేల వరకు ఉంటుందని అన్నారు. చిన్న పిల్లలపై కూడా కుక్కలు దాడి చేస్తాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

చేయూత

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

వేములపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొల్కపట్నం గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన నూనగంటి వెంకన్న కుటుంబానికి గ్రామానికి చెందిన శ్రీ కంఠమహేశ్వరస్వామి గౌడ సంఘం యూత్ సభ్యులు ఆదివారం రూ.27,500 ఆర్థిక సాయం అందజేశారు. వెంకన్న కుటుంబానికి సానుభూతి తెలిపారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మహిళా కూలీలు కొమ్మనబోయిన మంగమ్మ, మాలి కరుణమ్మ, గండెబోయిన భాగ్యమ్మ, సైదమ్మ, బారి మస్తాన్‌లు సైతం తమవంతుగా రూ.5వే ఆర్థికక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బుర్రి వెంకన్న, బొమ్మగాని సతీష్, హరికృష్ణ, సైదులు, కత్తి జానయ్య, జెర్రిపోతుల గిరిబాబు, వెంకటేష్, పందుల అజయ్, బొల్లెపల్లి బక్కయ్య, నాగరాజు, రవి, వెంకన్న, నరేష్, నవీన్, కానుగు రాములు, వడ్డెగాని జానయ్య, శ్రీను, వెంకటేష్, నరేష్, రాజశేఖర్, సుమన్, వెంకన్న, రామకృష్ణ, నాగయ్య, శ్రీరాములు, ఎల్లయ్య, చంద్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.